సాక్షి
నిజామాబాద్

గురువారం । 29 । ఆగస్టు । 2024



స్టేడియం కల నెరవేరేనా..

పాత కలెక్టరేట్ మైదానంలో కొత్త స్టేడియం నిర్మాణం కోసం జిల్లా క్రీడాకారులు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు.

- 8లో ▸



'ఎలీసా'తో డెంగీ నిర్ధారణ

జీజీహెచ్‌లో మాత్రమే నిర్వహించే ఎలీసా టెస్ట్‌తో డెంగీ నిర్ధారణ అవుతుందని అడిషనల్ కలెక్టర్ అంకిత్ అన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం

32.1 /21.8

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నాయి

న్యూస్‌రీల్

బీజేవైఎం జిల్లా అధ్యక్షుడిగా సతీశ్‌రెడ్డి



సుభాష్‌నగర్: భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) జిల్లా అధ్యక్షుడిగా డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి గ్రామానికి చెందిన పానుగంటి సతీశ్‌రెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడిగా సతీశ్‌రెడ్డిని నియమించినట్లు ఆయన పేర్కొన్నారు. తన నియామకానికి కృషి చేసిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి కిషన్ రెడ్డి, ఎంపీ అర్వింద్ ధర్మపురి, అర్బన్, ఆర్మూర్ ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్‌రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సేవెళ్ల మహేందర్, జిల్లా అధ్యక్షుడు దినేశ్‌కులాచారి, జిల్లా, రాష్ట్ర పదాధికారులకు సతీశ్‌రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలు, కాంగ్రెస్ యువకులకు ఇచ్చిన జాబ్ క్యాలెండర్, ఇతరాత్ర హామీలపై ఉద్యమిస్తామని ఆయన పేర్కొన్నారు.

ఎస్సారెస్పీలోకి తగ్గిన ఇన్‌ఫ్లో

బాల్కొండ : ఎగువ ప్రాంతాల నుంచి శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టింది. బుధవారం ఉదయం ఇన్‌ఫ్లో 15 వేల క్యూసెక్కులకు తగ్గిన ఇన్‌ఫ్లో మధ్యాహ్నానికి 10 వేలకు, సాయంత్రం సమయానికి 7 వేల క్యూసెక్కులకు పడిపోయింది. కాకతీయ కాలువ ద్వారా 3 వేల క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 150, సరస్వతి కాలువ ద్వారా 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, ఆవిరి రూపంలో 578 క్యూసెక్కులు నీరు పోతోంది. మిషన్ భగీరథ అవసరాలకు 231 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80 టీఎంసీలు) అడుగులు కాగా బుధవారం సాయంత్రానికి 1084.90(59.50 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

జాతీయ హాకీ క్యాంపునకు ఎంపిక



నితిన్




సజన్



మనోజ్

నిజామాబాద్‌నాగారం: జాతీయ స్థాయి జూనియర్ మెన్ హాకీ కోచింగ్ క్యాంపునకు జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారులు ఎంపికైనట్లు హాకీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సదమస్తుల రమణ తెలిపారు. తెలంగాణ హాకీ అసోసియేషన్ ఆదేశాల మేరకు ఈనెల 28 నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించే క్యాంపునకు జిల్లాకు చెందిన క్రీడాకారులు అగ్గు మనోజ్, రాసబోయిన సజన్, బానోత్ నితిన్ ఎంపికయ్యారన్నారు. ఎంపికైన క్రీడాకారులను అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విశాఖ గంగారెడ్డి, కోశాధికారి పింజ సురేందర్ , ఉపాధ్యక్షుడు టీ విద్యాసాగర్‌రెడ్డి, రిటైర్డ్ హాకీ కోచ్ హర్షవర్ధన్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ అంజు, సంయుక్త కార్యదర్శులు ఎండీ జావిద్, ఎండీ ఆరిఫ్, చిన్నయ్య, ఈసీ మెంబర్లు, సీనియర్ హాకీ క్రీడాకారులు నాగేశ్, సంతోష్ ఠాకూర్, సుధీర్, కత్తి శీను, నవనీత్, జిమ్మి రవి అభినందించారు.

రుణ వసూళ్లపై అధికారులకు అవగాహన



నిజామాబాద్‌అర్బన్: మహిళా సంఘాలకు అందిస్తున్న రుణాలు, వసూళ్లపై బ్యాంకు అధికారులకు కలెక్టర్ కార్యాలయంలో బుధవారం అవగాహన కల్పించారు. బ్యాంక్ లోన్లు, రుణ వసూళ్లు, మహిళాశక్తి కార్యక్రమాలను ఈ సందర్భంగా డీఆర్డీవో సాయాగౌడ్ వివరించారు. దీర్ఘకాలిక రుణాల రికవరీ, కొత్త లోన్‌ల పంపిణీ మార్గదర్శకాలపై అవగాహనర కల్పించారు. సమావేశంలో ఉమ్మడి జిల్లాలోని ఆయా బ్యాంకుల మేనేజర్లు, ఫీల్డ్ ఆఫీసర్లు, నేషనల్ రీసోర్స్ పర్సన్ రమేశ్, సెర్ప్ ప్రాజెక్ట్ మేనేజర్ వీరమల్లు, ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటీవ్ వెంకట్, అశోక్ చౌహాన్, అదనపు డీఆర్డీవోలు మురళీకృష్ణ, రవీందర్, డీపీఎం నీలిమ, రవీందర్ పాల్గొన్నారు.

హెల్మెట్ అవేర్‌నెస్..



నగరంలో హెల్మెట్లు ధరించి వాహనాలు నడుపుతున్న జిల్లా న్యాయమూర్తి సునీత కుంచాల, సీపీ, కలెక్టర్




అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు

వ్యవహారికం.. సౌకర్యం

'మంది కోసం రాసే కవి
మంది భాషల్నే రాయాలె
పిడుగనుంటి గిడుగు
చెప్పిందిదే
అప్పుడే కవి మందిమనిషైతడు
కవిత్వం మందిని
ఎలుగులోకి తెస్తది
మంది ఎలుగు పువ్వులై
శీకటిని మాయం జేస్తరు'

గిడుగు రామమూర్తి పంతులు గ్రాంథిక వచనానికి స్వస్తి చెప్పి వ్యవహారిక భాషలోనే ప్రజలు సహజంగా మాట్లాడుకునే భాషలోనే రచనలు సాగించాలంటూ స్వచ్ఛందంగా ఉద్యమం నడిపాడు. ఆయన చేసిన పోరాటానికి గౌరవంగా గిడుగు పుట్టినరోజైన ఆగస్టు 29న 'వ్యవహారిక భాషా దినోత్సవం' జరుపుకుంటున్నాం. గిడుగు రామమూర్తి పంతులు శ్రీకాకుళం జిల్లా పర్వతాలపేటలో పుట్టినప్పటికీ తెలుగు భాష మాట్లాడేవారందరికీ గొప్ప స్ఫూర్తి ప్రదాత.



- గ్రాంథికానికి బదులు సరళమైన తెలుగు కోసం ఉద్యమించిన గిడుగు
- దీంతో జిల్లాల వారీగా మాండలికాలకు ప్రాధాన్యం
- జిల్లా అధికారుల సర్క్యులర్లు, కోర్టు తీర్పులు తెలుగులోనే ఇవ్వాలంటున్న సామాన్యులు
- నేడు వ్యవహారిక భాషా దినోత్సవం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : సామాన్య ప్రజలు మాట్లాడే భాషలో ఉన్నటువంటి సొగసు, అందమైన పలుకుబడులు, సంస్కృతిని తెలియచెప్పే పదాల సంపద ఇప్పటి రచనల్లో కనబడుతోందంటే గిడుగు వారు చేసిన ఉద్యమ ఫలితమే. ఎంతో అద్భుతమైన సాహిత్యం సృష్టించగలిగే సత్తా ఉన్నప్పటికీ గ్రాంథిక భాషకు భయపడి దూరంగా ఉన్న ప్రతిభామూర్తులు వెలుగులోకి వచ్చారంటే అది ఆయన చేసిన పోరాట ఫలితమే. ఇప్పుడు స్వేచ్ఛగా సాహితీ ప్రియులు, సాహిత్య సృజనకారులు సాహిత్యాన్ని ఆస్వాదిస్తున్నారు. సామాన్యులు తరచూ ఉపయోగించేలా మరింత సాహితీ సంపదను సృష్టిస్తున్నారు. ప్రతిఏటా ఆగస్టు 29న వ్యవహార భాషలో రచనలు రావాలన్న లక్ష్యానికి పునరంకితమై ముందుకు సాగడమే ఆయనకు మనం ఇచ్చే నివాళి. ప్రభుత్వ పరంగా కూడా ఈ దిశగా ప్రోత్సాహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు అవుతున్నప్పటికీ ఇప్పటికీ జీవోలు మాత్రం ఆంగ్లంలోనే వస్తున్నాయి. ప్రజల భాష మాత్రం మాటలకే పరిమితమైపోయింది. న్యాయమూర్తి మంగారి రాజేందర్ తెలుగులో తీర్పు ఇచ్చినప్పుడు అందరూ మురిసిపోయారు. అడపా దడపా కోర్టు తీర్పులు తెలుగులో మెరిసినా అల్ప సంతోషంతోనే సరిపెట్టుకునే పరిస్థితి. ఇది తప్పనిసరి చేయాల్సిన అవసరం ఉంది. అలాగే ప్రభుత్వ ఉత్తర్వులు, కింది స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు సైతం జరిగే సమాచార సంప్రదింపులు ఆంగ్లంలో కాకుండా తెలుగులో, అదీ ప్రజల వ్యవహార భాషలో జరిగినప్పుడే 'గిడుగు వారి' కృషి సంపూర్ణంగా ఫలించినట్టు.

గిడుగు స్ఫూర్తిని గౌరవించాలి.. ఆచరించాలి..



గిడుగు రామమూర్తి పంతులు చేసిన వ్యవహార భాషా ఉద్యమ స్ఫూర్తిని పూర్తిగా గ్రహించి, ఆచరించాలి. వ్యవహార భాషలో రచనలు చేస్తున్నవారిని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించి గౌరవించాలి. అలాకాకుండా తెలుగు భాష దినోత్సవం పేరిట పండితులను గౌరవించడం, సత్కరించడం కొన్నిచోట్ల జరుగుతోంది. ఒక్కమాటలో చెప్పాలంటే సత్కార సభల మాదిరిగా హడావుడి చేస్తున్నారు. ఇలాంటి ధోరణి మారాలి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత వ్యవహార భాషలో చాలా రచనలు వచ్చాయి. వస్తున్నాయి. ఒక విధంగా తెలంగాణలో గిడుగు వారి ఆకాంక్ష నెరవేరుతోంది. ప్రజల భాషలో పాలన, ప్రజల భాషలో సాహిత్యం సమాజ ప్రగతి వేగవంతం కావడానికి కారణం అవుతాయి. ప్రజా చైతన్యమే పాలకులను సాహితీవేత్తలను నడిపిస్తాయి. వ్యవహార భాష కోసం ప్రజలు మరింతగా పాటుపడాలి.

– ఘనపురం దేవేందర్,
తెలుగు ఉపాధ్యాయుడు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

లేఖనంలో తెలుగును రక్షించాలి..



భాషణంలో బతుకుతున్న తెలుగు లేఖనంలో మాత్రం కుంచించుకుపోతోంది. భాషణంలోనూ ఆంగ్ల పదాల దబాయింపు తో తెలుగు పదాల పోహళింపు కనబడకుండా అస్పష్టంగా వినబడుతోంది. ఎంత వ్యవహారిక భాష అయినా, తెలుగు సొంత గొంతుక వినిపించలేకపోతోంది. మధురమైన భాషగా, మహాత్ముల చేత కొనియాడబడిన మన తెలుగు, సంకర భాషగా, వంకర భాషగా వినబడుతోంది. పిలుపులో, వరుసల్లో, బంధాల్లో తెలుగు రీతి పూర్తిగా మారిపోతోంది. ముఖ్యంగా యువత మాట్లాడుతున్న భాష, భాషాభిమానులకు భయాన్ని పుట్టిస్తోంది. ఇక లేఖనం విషయానికి వస్తే తెలుగులో తప్పులు రాయడమనేది సహజమైన విషయంగా మారిపోయింది. పాఠశాల విద్యార్థుల రాతల్లో అక్షర దోషాలు అడుగడుగునా దర్శనమిస్తున్నాయి. ఆంగ్ల మాధ్యమం మోజులో అభివ్యక్తీకరణకు ఆలంబనగా నిలిచే మాతృభాషా లేఖనం క్షీణిస్తోంది. దీనిపై ప్రతిఒక్కరూ దృష్టి సారించాలి.

– డాక్టర్ కాసర్ల నరేశ్‌రావు, కవి, రచయిత, తెలుగు ఉపాధ్యాయులు

ప్రమాద రహిత జిల్లాగా మారుద్దాం



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

- నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యంతోనే రోడ్డు ప్రమాదాలు
- అవగాహన సదస్సులో జిల్లా జడ్జి సునీత కుంచాల, కలెక్టర్, సీపీ

ఖలీల్‌వాడి : నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కారణంగానే రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని జిల్లా జడ్జి సునీత కుంచాల, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ అన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ జిల్లాను ప్రమాదరహిత జిల్లాగా మారుద్దామని వారు పిలుపునిచ్చారు. ట్రాఫిక్ నిబంధనలను, హెల్మెట్ ఆవశ్యకతపై హైస్కూల్, కళాశాల విద్యార్థులకు జిల్లా కేంద్రంలోని పోలీస్‌పరేడ్ గ్రౌండ్‌లో బుధవారం అవగాహన కల్పించారు. పరేడ్ గ్రౌండ్ నుంచి కోర్టు కాంప్లెక్స్ చౌరస్తా వరకు ప్లకార్డులను ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించగా, కలెక్టర్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. న్యాయమూర్తితోపాటు సీపీ కల్మేశ్వర్ హెల్మెట్లు ధరించి వాహనాలు నడిపారు. జిల్లా పోలీసు శాఖ, న్యాయ సేవాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

జిల్లా జడ్జి సునీత కుంచాల మాట్లాడుతూ.. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులు కూడా నేరస్తులుగా పరిగణించబడతారని, చట్ట ప్రకారం మూడేళ్ల వరకు కారాగార శిక్ష, రూ.25వేల వరకు జరిమానా విధించబడుతుందని తెలిపారు. సరదాల కోసం వాహనాలను నడిపి తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగల్చవద్దని విద్యార్థులకు సూచించారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ.. హెల్మెట్ ధరించి వాహనాలు నడిపితే దాదాపు 90 శాతం వరకు ప్రాణాపాయం తమను తాము కాపాడుకునే అవకాశం ఉంటుందన్నారు.

సీపీ కల్మేశ్వర్ మాట్లాడుతూ.. వాహనదారులు హెల్మెట్లు ధరించకపోవడం కారణంగా ప్రమాదాల బారిన పడుతున్నారని, బాధితుల్లో 55శాతానికి పైగా యువతే ఉన్నారన్నారు. జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో గతేడాది 337 మంది, ఈ ఏడాది ఇప్పటి వరకు 218 మంది ప్రాణాలు కోల్పోయారని, మృతుల్లో ద్విచక్ర వాహనదారుల సంఖ్య ఎక్కువగా ఉందన్నారు.

కార్యక్రమంలో అదనపు జిల్లా సెషన్స్ జడ్జీలు కనకదుర్గా, టి శ్రీనివాస్, ఆశలత, సీనియర్ సివిల్ జడ్జీలు ఎం శ్రీకాంత్‌బాబు, పి పద్మావతి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె గోపీకృష్ణ, అదనపు జూనియర్ సివిల్ జడ్జీలు ఖుష్బూ ఉపాధ్యాయ్, పి.శ్రీనివాస్‌రావు, మేజిస్ట్రేట్లు వి హరికుమార్, చైతన్య, అదనపు డీసీపీ కోటేశ్వర్‌రావు, ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, ఎంవీఐ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న కలెక్టర్ హనుమంతు



సీపీ కల్మేశ్వర్..

ఫ్యామిలీ గ్రూపింగ్ సర్వే పూర్తి చేయాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంతోపాటు జిల్లాలోని రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ వర్తింపజేయాలని, వ్యవసాయాధికారులు రుణమాఫీ కాని ప్రతిరైతునూ కలిసి సమస్యను తెలుసుకుని ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతి రెడ్డి సూచించారు. నగరంలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌజ్‌లో రైతు రుణమాఫీ అంశంపై వ్యవసాయ, అనుబంధశాఖల అధికారులతో బుధవారం సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్, డీసీవో శ్రీనివాస్‌రావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ అశోక్ చౌహాన్, రూరల్ ఏడీఏ ప్రదీప్‌కుమార్, నియోజకవర్గ ఏవోలు, ఏఈవోతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ముఖ్యంగా బ్యాంకర్ల తప్పిదాల కారణంగా రుణమాఫీకి అర్హత పొందలేని రైతుల సమస్యలను కూడా పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా, నియోజకవర్గ, మండల, క్లస్టర్ వారీగా వ్యవసాయ అధికారులు షెడ్యూల్ ప్రకారం ఫ్యామిలీ గ్రూపింగ్ సర్వేను 15 రోజుల్లో పూర్తి చేయాలన్నారు. సర్వే వివరాలు ఎప్పటికప్పుడు ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రతి రైతుకూ రుణమాఫీ వర్తించేలా చర్యలు తీసుకోవాలని, అందుకోసం వ్యవసాయ అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ బదావత్ తారాచంద్ నాయక్, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, గిరిజన కాంగ్రెస్ చైర్మన్ కేతావత్ యాదగిరి, సొసైటీ చైర్మన్లు, ఆయా మండలాల అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

రెండు నిండు ప్రాణాలు బలి

రోడ్డును ఆనుకుని నిలిపిన లారీని ఢీకొట్టిన కారు

- ఇద్దరు యువకుల దుర్మరణం
- మరో యువకుడికి తీవ్రగాయాలు
- రూరల్ మండలం శ్రీనగర్ వద్ద ఘటన



ప్రమాదానికి కారణమైన లారీ



కారులో క్షతగాత్రుడు, మృతదేహాలు



దండ్ల వంశీ (ఫైల్)



రాజేశ్(ఫైల్)

నిజామాబాద్ రూరల్: నిర్లక్ష్యం.. అతివేగం కారణంగా రెండు నిండు ప్రాణాలు బలయ్యాయి. బురదలో కూరుకుపోయిన లారీని డ్రైవర్ నిర్లక్ష్యంగా వదిలేయగా, అతివేగంగా కారులో దూసుకువచ్చిన కారు దాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో యువకుడు తీవ్రగాయాలపాలయ్యాడు. నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆకులకొండూర్ – శ్రీనగర్ గ్రామాల మధ్య చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి సౌత్ రూరల్ సీఐ సురేశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మాక్లూర్ మండలం చిక్లికి చెందిన వంశీ(18), జిల్లా కేంద్రంలోని కుమార్‌గల్లీకి చెందిన రాజేశ్,(19) దుబ్బకు చెందిన ఆకాశ్(19) ముగ్గురు స్నేహితులు. ఆకాశ్ చదువుకుంటూ డ్రైవింగ్ చేస్తుండగా, రాజేశ్ కుమార్‌గల్లీలోని కిరాణా దుకాణంలో, వంశీ ఓ ప్రైవేట్ హోటల్‌లో పని చేస్తున్నారు. మంగళవారం రాత్రి ముగ్గురు ఒకే రూములో ఉన్నారు. వంశీకి తన సొంతూరు చిక్లిలో పని ఉండడంతో అతడిని దింపేందుకు కారులో ముగ్గురు కలిసి బుధవారం తెల్లవారుజామున 5.30గంటలకు బయల్దేరారు. ఈ క్రమంలో ఆకుల కొండూర్ – శ్రీనగర్ మధ్య ఉన్న గజానంద్ రైస్‌మిల్ వద్ద గత రెండు రోజులుగా దిగబడి ఉన్న లారీని కారు వేగంగా ఢీకొట్టింది. దండ్ల వంశీ, వంగరి రాజేశ్ అక్కడికక్కడే మృతి చెందగా, డ్రైవింగ్ చేస్తున్న ఆకాశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్సై ఆరిఫ్ సిబ్బందితో కలిసి ఘటనాస్థలానికి చేరుకున్నారు. గాయాలపాలైన ఆకాశ్‌ను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రైస్ మిల్లుల యాజమాన్యాలు నిర్లక్ష్యం కారణంగా ప్రతిరోజూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

గజానంద్ రైస్‌మిల్లు ఎదుట మృతుల కుటుంబ సభ్యులు ధర్నా చేయగా, సౌత్ రూరల్ సీఐ సురేశ్ కల్పించుకొని సముదాయించారు. మృతుడు వంశీ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు లారీ యజమాని, డ్రైవర్‌తోపాటు కారును అతివేగంగా నడిపిన ఆకాశ్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో ఓటరు జాబితా

- వార్డుల వారీగా సిద్ధం చేయనున్న అధికారులు
- సెప్టెంబర్ 5లోగా జాబితా రూపొందించాలని ఆదేశాలు

మోర్తాడ్(బాల్కొండ): గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం వార్డుల వారీగా ఓటరు జాబితాను ఆన్‌లైన్‌లోనే సిద్ధం చేయాలని ఉన్నతాధికారులు నిర్దేశించారు. మాన్యువల్ పద్ధతిలో జాబితాను రూపొందిస్తే తప్పులు చోటు చేసుకుంటున్నాయనే ఉద్దేశంతో తెలంగాణ పోల్ యాప్‌లోనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఫిబ్రవరి 2024 నాటి ఓటర్ల జాబితాను గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా విభజన చేసి ఒక కుటుంబంలోని ఓటర్లందరూ ఒకే వార్డులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. సెప్టెంబర్ 5 నాటికి ఓటరు జాబితాను ఆన్‌లైన్‌లో నమోదు చేసి 6వ తేదీన విడుదల చేయాల్సి ఉంది. ఆ తరువాత ఏమైనా అభ్యంతరాలు ఉంటే వాటి ఆధారంగా సవరించి తుది జాబితా విడుదల చేయాల్సి ఉంటుంది. జిల్లాలో కొత్తగా ఏర్పాటైన పంచాయతీలను కలుపుకుని మొత్తం 545 గ్రామ పంచాయతీలు ఉండగా, 4,501 వార్డు స్థానాలు, సుమారు 6.80లక్షల మంది ఓటర్లు ఉన్నారు. వార్డుల వారీగా ఓటరు జాబితాను విభజించడంలో పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఉన్నతాధికారులు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఓటరు జాబితా సవరణ ఇతర అంశాలకు సంబంధించి ఇప్పటికే ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులకు లాగిన్ ఐడీలు ఇచ్చారు. చిన్న పంచాయతీల్లో త్వరగానే ఓటరు జాబితాను సిద్ధం చేసే అవకాశం ఉండగా, పెద్ద పంచాయతీల్లో ఎక్కువ సమయం తీసుకునే అవకాశం ఉంది.



తప్పులు లేకుండా ఓటరు జాబితా

వార్డుల వారీగా ఓటరు జాబితాను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, సవరించడంలో ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. సకాలంలో ఓటరు జాబితాను సిద్ధం చేసి నిర్దేశించిన సమయంలో డ్రాఫ్ చేయాలి. ఎంపీడీవోలు, ఏంపీవోలు ప్రతిరోజూ పర్యవేక్షించాలి.

– తరుణ్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి

క్లుప్తంగా

తల్ సైనిక్ క్యాంపునకు జీజీ కళాశాల విద్యార్థి ఎంపిక


బందు నాయక్

నిజామాబాద్అర్బన్: గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల ఎన్‌సీసీ విభాగానికి చెందిన బందు నాయక్ 'ఢిల్లీ-తల్' సైనిక్ క్యాంపునకు ఎంపికై నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి. రామ్మోహన్ రెడ్డి తెలిపారు. వివిధ క్యాంపుల్లో ప్రతిభ కనబరిచిన ఎన్‌సీసీ విద్యార్థులను ఆయన అభినందించారు. బందు నాయక్ ఎంపిక కావడానికి కళాశాలలో ఇచ్చే శిక్షణనే కారణమని ఎన్‌సీసీ అధికారి లుటెనెంట్ రామస్వామి తెలిపారు.

తెయూ బయోటెక్నాలజీ హెచ్‌వోడీగా ప్రసన్నశీల



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ బయోటెక్నాలజీ హెచ్‌వోడీగా ఎం. ప్రసన్న శీల నియమితులయ్యారు. తెయూ ఇన్‌చార్జీ వీసీ సందీప్‌కుమార్ సుల్తానియా ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరి బుధవారం ప్రసన్నశీలకు నియామకపు ఉత్తర్వులు అందజేశారు. ప్రస్తుతం ప్రసన్నశీల జువాలజీ హెచ్‌వోడీగా వ్యవహరిస్తున్నారు. ప్రసన్నశీల గతంలో అదనపు కంట్రోలర్‌గా, ఉమెన్ సెల్ డైరెక్టర్‌గా, పబ్లికేషన్స్ సెల్ డైరెక్టర్‌గా, బయోటెక్నాలజీ బీవోఎస్ చైర్‌పర్సన్‌గా పలు పదవులను సమర్థవంతంగా నిర్వహించారు. ఆమెను పలువురు అధ్యాపకులు అభినందించారు.

రేపు తెయూలో జాబ్‌మేళా

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 30న హెటిరో డ్రగ్ ఫార్మా కంపెనీ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కెమిస్ట్రీ విభాగాధిపతి ఆడికె నాగరాజు బుధవారం తెలిపారు. తెయూ ఇన్‌చార్జీ వీసీ సందీప్ కుమార్ సుల్తానియా, రిజిస్ట్రార్ ఎం.యాదగిరి ఆదేశాల మేరకు వర్సిటీలో 2022, 2023, 2024 విద్యా సంవత్సరాలలో పీజీ పూర్తి చేసిన విద్యార్థుల కోసం ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ, ఎమ్మెస్సీ బయో కెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, జెనెటిక్స్, బీఎస్సీ లైఫ్ సైన్సెస్ విద్యార్థులు డ్రైవ్‌లో పాల్గొనేందుకు అర్హులని ఆయన తెలిపారు.

మొరాయించిన మాధవనగర్ రైల్వేగేట్



ఖలీల్‌వాడి: డిచ్‌పల్లి మండలంలోని మాధవనగర్ రైల్వేగేట్ సాంకేతిక లోపంతో మొరాయించింది. సాయంత్రం హైదరాబాద్ నుంచి రైలు రావడంతో రైల్వేగేట్‌ను సిబ్బంది వేశారు. రైలు వెళ్లిపోయిన తర్వాత గేట్‌ను పైకి ఎత్తడానికి ప్రయత్నించగా సాంకేతిక లోపంతో పైకి రాకపోవడంతో రెండు గంటల పాటు వాహనదారులు వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో రెండు వైపులా వాహనాలు భారీ సంఖ్యలో నిలిచిపోయాయి.

'స్టేడియం' కల నెరవేరేనా?

- పాత కలెక్టరేట్ మైదానంలో కొత్త స్టేడియం నిర్మిస్తే జిల్లా క్రీడాకారులకు మరింత ప్రయోజనం
- ఆ దిశగా చర్యలు తీసుకోవాలంటున్న జిల్లా ప్రముఖులు
- గత ప్రభుత్వం చేసిన తప్పును సరిదిద్దుతారా.. లేక సాగదీస్తారా.. తెలియని పరిస్థితి
- ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు చొరవ చూపాలని కోరుతున్న క్రీడాకారులు
- నేడు జాతీయ క్రీడా దినోత్సవం


పాత కలెక్టరేట్ మైదానం

నిజామాబాద్‌నాగారం: గత ప్రభుత్వం జిల్లాలో ఉన్న ఏకైక పాత కలెక్టరేట్ మైదానాన్ని కూల్చివేసేందుకు కుట్రలు పన్నింది. కళాభారతి కోసం స్టేడియాన్ని తరలించే ప్రయత్నం చేసింది. సీనియర్ క్రీడాకారులు అడ్డుకోవడంతో కలెక్టరేట్ మైదానంలో కూల్చివేతలు ఆగాయి. కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు బడ్జెట్‌లో పెద్ద ఎత్తున నిధులు కేటాయించింది. 'ఖేలో ఇండియా'లో నిధులు పుష్కలంగా ఉన్నాయి. స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తుతం ఉన్న మైదానంలో ఫుట్‌బాల్ ఆడారు. జిల్లా ఎంపీ అర్వింద్ కేంద్రం నుంచి నిధులు తెస్తే రెండు, మూడు నెలల్లో అధునాతన పద్ధతిలో స్టేడియం తయారవుతుంది. సౌకర్యాలు, కోచ్‌లు లేకున్నా జిల్లా నుంచి క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణిస్తున్నారు. అన్ని రకాల సదుపాయాలతో నూతన స్టేడియాన్ని నిర్మిస్తే వందల సంఖ్యలో క్రీడాకారులు అంతర్జాతీయస్థాయికి ఎదిగే అవకాశముంది.

జిల్లాలో క్రీడల పరిస్థితి అగమ్యగోచరం

నిజామాబాద్ జిల్లాలో క్రీడా మైదానాల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. నగర శివారు నాగారంలో ఉన్న రాజారాం స్టేడియం దశాబ్దకాలంగా శిథిలావస్థలో ఉంది. స్టేడియం ఉన్నా ఎవరూ పెద్దగా ఉపయోగించుకున్న ఘటనలు లేవు.ప్రస్తుతం ఈ స్టేడియం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. జిల్లా కేంద్రంతో పాటు ఆర్మూర్, బోధన్, భీమ్‌గల్ మున్సిపాలిటీల పరిధిలో కూడా సరైన క్రీడా మైదానాలు లేవు. బోధన్, జక్రాన్‌పల్లి, వేల్పూర్, కమ్మర్‌పల్లిలో ఏదో తూతూమంత్రంగా నాలుగైదు స్టేడియాలు అలా నిర్మించి ఇలా గాలికి వదిలేశారు.

అరకొర వసతులతో అంతర్జాతీయ స్థాయికి..

బాక్సింగ్‌లో నిఖత్ జరీన్, హుస్సాముద్దీన్, హాకీలో యెండల సౌందర్య, ఫుట్‌బాల్‌లో గుగులోత్ సౌమ్య లాంటి క్రీడాకారులు పాత కలెక్టరేట్ మైదానంలో ఓనమాలు నేర్చుకొని జిల్లా నుంచి అంతర్జాతీయస్థాయికి ఎదిగారు. వీరితో పాటు పదుల సంఖ్యలో క్రీడాకారులు బాస్కెట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, హ్యాండ్‌బాల్, సాఫ్ట్‌బాల్, కరాటే, స్విమ్మింగ్, అథ్లెటిక్స్, తదితర క్రీడల్లో జాతీయస్థాయిలో రాణిస్తూనే ఉన్నారు. అరకొర వసతుల మధ్యనే జిల్లాకు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో కీర్తి తెస్తున్నారు. ప్రస్తుత పాత కలెక్టరేట్ మైదానం సుమారు 6 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ స్థలంలో సింథటిక్ ట్రాక్‌తో పాటు స్టేడియాన్ని అందంగా తీర్చిదిద్దవచ్చు. ఎంపీ అర్వింద్‌తో పాటు స్థానిక ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు నిధులు కేటాయిస్తే రూ.4 కోట్లతో సింథటిక్ ట్రాక్ నిర్మించొచ్చని సీనియర్ క్రీడాకారులు పేర్కొంటున్నారు.

సీఎం, ఎంపీని కలిసి విన్నవిస్తా



పాత కలెక్టరేట్ మైదానంలో నూతనంగా స్టేడియం నిర్మించాలి. స్టేడియం నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డిని, జిల్లా ఎంపీ అర్వింద్‌ను కలిసి విన్నవిస్తాను. క్రీడాకారులకు తనవంతుగా సహాయసహకారాలు అందిస్తున్నాను. క్రీడలతోనే జీవితంలో ఉన్నతంగా ఎదుగుతారు.

– సరళ మహేందర్ రెడ్డి, రవి స్కూల్ కరస్పాండెంట్

కోచ్‌లను నియమించాలి



అన్ని క్రీడలకు ముందుగా కోచ్‌లను నియమించాలి. కోచ్‌లు లేకపోవడంతో సరైన శిక్షణ లేకుండా పోతుంది. అరకొర వసతుల మధ్య క్రీడాకారులకు శిక్షణ ఇవ్వడానికి ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వాలు మైదానాలను నిర్మిస్తే జిల్లాతో పాటు రాష్ట్రానికి, దేశానికి సైతం అధిక మొత్తంలో పతకాలు వస్తాయి.

– నాగరాజు, ఫుట్‌బాల్ కోచ్

క్రీడల్లో రాణిస్తే మెరుగైన భవిష్యత్



చిన్నప్పటి నుంచే పాఠశాలల్లో విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ ఇప్పించాలి. క్రీడలు సాధన చేస్తేనే క్రమశిక్షణతో పాటు చదువుల్లో రాణిస్తారు. క్రీడల్లో రాణించిన ప్రతి ఒక్కరికి మెరుగైన భవిష్యత్ ఉంటుంది. ప్రభుత్వాలు సైతం క్రీడారంగానికి పెద్ద పీట వేయాలి. జిల్లాలో స్టేడియం నిర్మిస్తే బాగుంటుంది.

– శ్రీనివాస్, ఖేలో ఇండియా కోచ్

ఎలీసా పరీక్షతోనే డెంగీ నిర్ధారణ సాధ్యం


ప్రైవేట్ వైద్యులతో సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్, ఇతర అధికారులు

- వ్యాధుల నియంత్రణలో ప్రైవేటు ఆస్పత్రులు భాగస్వామ్యం కావాలి
- జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్


హాజరైన ఐఎంఏ ప్రతినిధులు, ప్రైవేట్ వైద్యులు

నిజామాబాద్‌నాగారం: జిల్లాలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న దృష్ట్యా ప్రైవేట్ ఆస్పత్రులు క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్టుకు లోబడి పని చేయాలని, జీజీహెచ్‌లో మాత్రమే ఎలీసా పరీక్షతో డెంగీ నిర్ధారణ సాధ్యం అవుతుందని, వ్యాధుల నియంత్రణలో అందరు భాగస్వామ్యం కావాలని అదనపు కలెక్టర్ అంకిత్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్- 2010, సీజనల్ వ్యాధులపై ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. డెంగీ వ్యాధి నియంత్రణలో ప్రైవేట్ ఆస్పత్రులన్నీ ప్రభుత్వానికి సహకరిస్తూ వారి రిపోర్టులను తగిన సమయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయానికి చేరవేయాలన్నారు. డెంగీ నిర్ధారణ కోసం కొన్ని ప్రైవేటు ఆస్పత్రులలో కేవలం ఆర్డీటీ పరీక్ష తర్వాత డెంగీ నిర్ధారణ అయినట్లు తెలియజేస్తున్నారన్నారు. అలా కాకుండా డెంగీ నిర్ధారణ కోసం ఆర్డీటీ ద్వారా పరీక్షలు చేయడమే కాకుండా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి ఎలీసా పరీక్ష నిమిత్తం రిఫర్ చేయాలని, ఎలీసా పరీక్ష తర్వాత మాత్రమే డెంగీ నిర్ధారణ అవుతుందన్నారు. జిల్లాలో రోజురోజుకు కొత్తగా డెంగీ కేసులు నమోదవుతున్న తరుణంలో అన్ని ఆస్పత్రుల వైద్యులు తప్పకుండా రిపోర్టులను డీఎంహెచ్‌వో కార్యాలయానికి తెలియజేయాలన్నారు.

ధరల పట్టిక, నిబంధలను ప్రదర్శించాల్సిందే..

అన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ధరల పట్టిక, వైద్యులు, సిబ్బంది సమాచారాన్ని ప్రదర్శించాలన్నారు. ల్యాబ్, ఫార్మసీ నుంచి ప్రింటెడ్ బిల్స్ మాత్రమే ఇవ్వాలన్నారు. ప్రతి ఆస్పత్రి ఫిర్యాదుల పరిష్కార కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కీటక జనిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్, జిల్లా టీకాల అధికారి డాక్టర్ అశోక్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అతుల్ నేగి, ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ దామోదర్ రావు, డాక్టర్ శ్రీశైలం, జిల్లా ఉప వైద్యాధికారిణి నిజామాబాద్ డివిజన్ డాక్టర్ అంజన, బోధన్ డివిజన్ వైద్యాధికారి డాక్టర్ రాజు, జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు, మేనేజింగ్ డైరెక్టర్లు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వెలుగులోకి నకిలీ పట్టాల దందా

- రూ. 50 వేలకు ఒక పట్టా ఇచ్చిన ఆన్‌లైన్ సెంటర్ నిర్వాహకుడు
- నిందితుడి నుంచి పట్టాలు, స్టాంపులు స్వాధీనం చేసుకున్న పోలీసులు
- కార్పొరేటర్ భర్తతో పాటు పలువురిపై కేసుల నమోదు
- కొనసాగుతున్న విచారణ



ఖలీల్‌వాడి: నగరంలోని భారతీరాణి కాలనీలోని బొందెం చెరువు శిఖం భూమిలో రెవెన్యూ అధికారులు ఇళ్లను కూల్చివేసిన తర్వాత అక్రమాలు బయటపడుతున్నాయి. శిఖం భూమిని వెంచర్‌గా చేసి తక్కువ ధరకు ఇంటి స్థలాలు వస్తాయని బ్రోకర్లు ప్రజలకు గాలం వేశారు. బొందెం చెరువు ప్రక్కన 1.33 ఎకరాల పట్టా ల్యాండ్‌ను అదునుగా చేసుకొని ప్లాట్లను అమ్మకానికి పెట్టారు. అతి తక్కువ ధరలో ఇంటి స్థలం రావడంతో మధ్య తరగతి ప్రజలు కొనుగోలు చేసి, ఇళ్లు, షెడ్ల నిర్మాణం చేపట్టారు. గతంలో బీడీ కార్మికులకు 2149, 2150 సర్వే నంబర్లలో ఇంటి స్థలాలను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అందజేసింది. 60 మంది బీడీ కార్మికులకు ఈ సర్వే నెంబర్‌లో ఇవ్వకుండా బొందెం శిఖంలో ఇంటి స్థలాలిచ్చారు. రెవెన్యూ అధికారులు ఇళ్ల కూల్చివేతలో ఈ వ్యవహారం బయటకు వచ్చింది. బొందెం చెరువు శిఖం భూమిలో ఇంచుమించు 75 మందికి ప్లాట్లు అమ్మినట్లు రెవెన్యూ అధికారులు,పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది.

పోలీసుల అదుపులో కీలక నిందితుడు

నకిలీ పట్టాల దందా చేసే ఆన్‌లైన్ సెంటర్ నిర్వాహకుడిని పోలీసులు 4 రోజుల క్రితం అదుపులోకి తీసుకున్నారు. ఆయన నుంచి పట్టాలు, స్టాంపులు ఐదవ టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నిర్వాహకుడు ఓ పట్టా చేయడానికి రూ.50 వేలు తీసుకుంటారని పోలీసుల విచారణలో తెలిసింది. 12 ఏళ్ల క్రితం జిల్లా కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో రికార్డు గది కాలిపోవడంతో నకిలీ పట్టాలు సృష్టించడానికి వీరికి వీలు చిక్కింది. ముఠా సభ్యులు అప్పట్లో రెవెన్యూ అధికారులను మచ్చిక చేసుకొని నగరంలోని ప్రభుత్వ భూములు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించి వాటిని కబ్జా చేసి ప్లాట్లుగా చేసి అమ్మకాలు సాగించారు. ఆన్‌లైన్ సెంటర్ నిర్వాహకుడిని పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో ముఠా సభ్యులు గందరగోళంలో పడినట్లు తెలుస్తోంది. నగర సీపీగా కేఆర్ నాగరాజు ఉన్న సమయంలో నకిలీ పట్టాల వ్యవహారంలో టాస్క్ ఫోర్స్ పోలీసులు విచారణ జరిపి పలువురిపై కేసు నమోదు చేశారు. ఈ కేసు అప్పట్లో పూర్తి స్థాయిలో విచారణ జరగలేదనే ప్రచారం కూడా ఉంది. దీనిపై సీపీ కల్మేశ్వర్ దృష్టి సారిస్తే కొంత మంది లీడర్ల బయటపడే అవకాశం ఉన్నట్లు చర్చ జరుగుతోంది.

10 మందిపై కేసు.. సంఖ్య పెరిగే అవకాశం

బొందెం చెరువు శిఖం భూమిలో మొదట కమల, మహ్మద్, మక్కల గోపాల్, 10వ డివిజన్ కార్పొరేటర్ కోమల్ భర్త నరేశ్‌లపై కేసులు నమోదు చేశారు. ఐదో టౌన్ ఎస్సై వెంకట్రావు విచారణ చేయగా మస్తాన్, జావీద్, అనురాధ, ఉబేర్, అంజర్, మంజులతలను చేర్చారు. ఈ కేసులో మరి కొంత మందిని చేర్చే అవకాశం ఉంది.

ప్రాణం తీసిన భూ తగాదాలు

- చికిత్స పొందుతూ వ్యాపారి మృతి


విశ్వనాథం(ఫైల్)

కామారెడ్డి క్రైం: భూ తగాదాలు, ఆర్థిక లావాదేవీలు ఓ నిండు ప్రాణాన్ని బలిగొన్నాయి. మంగళవారం జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌కాలనీలో జరిగిన దాడి ఘటనలో తీవ్రంగా గాయపడిన వ్యాపారి పాత విశ్వనాథం(64) చికిత్స పొందుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో మృతిచెందాడు. దాడికి పాల్పడిన పలువురిపై పట్టణ పోలీసులు హత్యకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు.. పట్టణంలోని విద్యానగర్ కాలనీలో నివాసం ఉండే వడ్డీ వ్యాపారి విశ్వనాథంకు, దేవునిపల్లిలో నివాసం ఉంటున్న బిల్డర్ లక్ష్మీబాయికి మధ్య చాలా రోజులుగా ఆర్థిక లావాదేవీలు నడిచాయి. కొద్దిరోజులుగా డబ్బుల విషయంలో గొడవలు జరుగుతున్నాయి. నిర్మాణాల నిమిత్తం తాను అప్పుగా తీసుకున్న డబ్బులను వడ్డీతో సహా తిరిగి చెల్లించినప్పటికి విశ్వనాథం తనను ఇంకా బాకీ ఉన్నావని వేధింపులకు గురిచేస్తున్నాడని, మార్ట్‌గేజ్ చేసుకున్న ఆస్తిని తిరిగి ఇవ్వడం లేదని ఆరోపిస్తూ ఈ నెల 12న లక్ష్మీబాయి సెల్ఫీ వీడియో తీసి ఆత్మహత్యకు యత్నించింది. పురుగుమందు సేవించిన ఆమెను ఆస్పత్రిలో చేర్పించారు. ఆ తర్వాత ఆమె ఫిర్యాదు చేయడంతో దేవునిపల్లి పోలీస్‌స్టేషన్‌లో విశ్వనాథంతో పాటు మరో నలుగురిపై కేసు నమోదైంది. ఇదిలా ఉండగా మంగళవారం విశ్వనాథం దగ్గర్లోని గుడికి వెళ్లి తిరిగి వస్తుండగా లక్ష్మీబాయి, మరో నలుగురు వ్యక్తులు ఎదురుపడ్డారు. డబ్బుల విషయంలో మాటలు పెరిగి విశ్వనాథంపై దాడి చేశారు. గాయపడిన విశ్వనాథంను స్థానికులు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి సమయంలో విశ్వనాథం మృతిచెందారు. పట్టణ పోలీసులు విచారణ జరిపి లక్ష్మీబాయితో పాటు దాడికి పాల్పడిన మిగతా వారిపై కూడా హత్య కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

శతాధిక వృద్ధురాలి మృతి


నాయికోట్ కళావతి(104)

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని రాజారాంనగర్ కాలనీకి చెందిన శతాధిక వృద్ధురాలు నాయికోట్ కళావతి(104) బుధవారం మృతిచెందింది. ఆమె కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. బుధవారం మృతిచెందగా కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. మృతురాలికి కుమార్తె ఉన్నారు.

పెళ్లి విందులో లొల్లి

- ఇరువర్గాలకు చెందిన 19 మందిపై కేసు

నవీపేట: మండల కేంద్రంలోని ఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం జరిగిన పెళ్లి విందులో ఇరు వర్గాలకు చెందిన కొందరు పరస్పర దాడులకు పాల్పడడంతో 19 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు. భోజనం చేస్తున్న సమయంలో ఒక వర్గానికి చెందిన వారికి సరిగ్గా వడ్డించడం లేదని మరో వర్గానికి చెందిన వ్యక్తులతో ఘర్షణకు దిగారు. ఘర్షణ ముదిరి కర్రలు, రాళ్లతో కొట్టుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులకు ఫంక్షన్ హాల్‌కు చేరుకుని శాంతింపజేశారు. పలువురిపై కేసు నమోదు చేశారు.

నేడు ఓపెన్ యూనివర్సిటీ డైరెక్టర్, జేడీల సందర్శన

కామారెడ్డి అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ కామారెడ్డి స్టడీ సెంటర్‌ను గురువారం మధ్యాహ్నం 2 గంటలకు విశ్వవిద్యాలయం డైరెక్టర్, జాయింట్ డైరెక్టర్లు సందర్శించనున్నట్టు సెంటర్ సమన్వయకర్త ఆకుల సుధాకర్ తెలిపారు. ఆ తర్వాత విశ్వవిద్యాలయం ప్రగతి, కోర్సుల వివరాలను వెల్లడిస్తారని ఆయన అన్నారు.

అప్రమత్తంగా ఉండాలి


రోగులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

సిరికొండ: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున, విష జ్వరాల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన బుధవారం తనిఖీ చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పారిశుధ్యంపై సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో తారాచంద్, ఎమ్మార్వై గంగారాజం, సూపరింటెండెంట్ లక్ష్మీపతి, జూనియర్ అసిస్టెంట్ భాస్కర్ ఉన్నారు.

స్వగ్రామానికి చేరుకున్న మృతదేహం

బాల్కొండ: మెండోరా మండలం చాకిర్యాల్ గ్రామానికి చెందిన మండోజీ రాజేశ్వర్(54) దుబాయిలో గుండెపోటుతో వారం రోజుల క్రితం మృతిచెందారు. ఆయన మృతదేహం బుధవారం స్వగ్రామానికి చేరుకుంది. మృతదేహం స్వగ్రామం చేరుకోవడానికి బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి కృషి చేశారని బాధితకుటుంబ సభ్యులు తెలిపారు. ఎయిర్‌పోర్టు నుంచి స్వగ్రామం వరకు మృతదేహం తరలించటానికి ఉచితంగా అంబులెన్స్ ఏర్పాటు చేశారన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో ఐదుగురి మృతి

కరెంటు షాక్‌తో యువకుడు..


అభిలాష్(ఫైల్)

నందిపేట్(ఆర్మూర్): మాయాపూర్ గ్రామానికి చెందిన గుడ్డోళ్ల అభిలాష్(20) అనే యువకుడు కరెంటు షాక్‌కు గురై మృతి చెందాడు. వివరాలు.. పిన్నమ్మ కూతురి వివాహానికి అభిలాష్ తన తల్లితో కలిసి రెంజల్ మండల కేంద్రానికి వెళ్లారు. అక్కడ పెళ్లి వేడుకలలో భాగంగా మంగళవారం రాత్రి హల్దీ వేడుకలు జరుగుతుండగా ఫోన్ రావడంతో అభిలాష్ దాబాపైకి వెళ్లాడు. ఫోన్ మాట్లాడుతూ పొరపాటున పెళ్లి వేడుక కోసం ఏర్పాటు చేసిన లైటింగ్‌కు చేయి తగలడంతో కరెంటు షాక్‌కు గురై మృతి చెందాడు. మృతదేహాన్ని స్వగ్రామం నందిపేట మండలం మాయాపూర్ గ్రామానికి తీసుకురాగా బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు.

కారు ఢీకొని వృద్ధురాలు..

ఖలీల్‌వాడి: కారు ఢీకొనడంతో వృద్ధురాలు మృతి చెందిన ఘటన నగరంలోని ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు బుధవారం తెలిపారు. వివరాలు.. మంగళవారం మధ్యాహ్నం సీతారామ్ నగర్ కాలనీకి చెందిన వృద్ధ దంపతులు ఆరోగ్యం బాగోలేకపోవడంతో ఆర్టీసీ ఆస్పత్రిలో చూపించుకొని తిరిగి ఎల్లమ్మగుట్ట నిక్ బైక్‌పై వెళ్తుండగా ఆర్టీసీ డిపో-1 ముందర వెనక నుంచి వచ్చిన కారు వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో చల్లా భూలక్ష్మి తలకు గాయాలయ్యాయి. చికిత్స పొందుతూ బుధవారం ఆమె మృతి చెందారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరు..

మోర్తాడ్: మండల కేంద్రంలో భగత్‌సింగ్ కాలనీకి చెందిన దండుగుల వెంకటి(35) బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. రాత్రిపూట ఇంటి వద్ద ఉన్న విద్యుత్ తీగలు తగలడంతో షాక్‌కు గురై మరణించి ఉంటాడని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. మృతుడు వ్యవసాయ కూలీ. భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ ..

భిక్కనూరు: జంగంపల్లి శివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బస్వాపూర్‌కు చెందిన రాగి బాలమణి(49) మృతి చెందినట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ తెలిపారు. వివరాలు.. బాలమణి స్థానికంగా ఉన్న ఎల్లమ్మ దేవాలయం వద్ద రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో బాలమణికి తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కాసేపటికి మృతి చెందారు. మృతురాలి కుమారుడు మహేష్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

గుర్తు తెలియని వ్యక్తి ..

ఖలీల్‌వాడి: జీజీహెచ్‌లో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. వివరాలు.. ఆస్పత్రి ఆవరణలో అటెండెంట్స్ షెల్టర్ వద్ద ఒక వ్యక్తి(42-45) కింద పడిపోయి ఉన్నట్లు పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. డాక్టర్లు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు షర్ట్, బ్లూ కలర్ ప్యాంటు ధరించి ఉన్నారు. ఆయన వద్ద ఎటువంటి ఆధారాలు దొరకలేదు. సంబంధీకులు ఎవరైనా ఉంటే వారు ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్‌కు 8712659837, 871259714, 08462-220150 నంబర్ల ద్వారా సమాచారమివ్వాలని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

చిన్నారిపై కుక్కల దాడి


గాయపడిన చిన్నారి

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో బుధవారం పలువురిపై కుక్కలు దాడులకు పాల్పడ్డాయి. పట్టణంలోని ఓ చిన్నారి మరియ(5)పై దాడి చేయడంతో చెవి, చేతులపైన తీవ్రగాయాలయ్యాయి. చిన్నారిని స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స చేశారు. అలాగే మామిడిపల్లిలో పలువురిపై కుక్కలు దాడిచేశాయి. అలాగే చిన్నారి కుటుంబ సభ్యులు మున్సిపల్ కార్యాలయానికి వచ్చి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రాజును డిమాండ్ చేశారు.

ఇసుక ట్రాక్టర్‌కు జరిమానా

బిచ్కుంద(జుక్కల్): ఖద్గాంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం రాత్రి పట్టుకున్నట్లు స్థానిక తహసీల్దార్ సురేష్ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నందుకు రూ.3 వేల జరిమానా విధించామన్నారు. ఎవరైన అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే 9491036923 నెంబరుకు సమాచారం అందించాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తహసీల్దార్ తెలిపారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని తక్కడ్‌పల్లి వద్ద బుధవారం మూడు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. మంజీరా నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు గ్రామస్తుల సమాచారం మేరకు తక్కడ్‌పల్లి వద్ద పట్టుకున్నామని ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. రెవెన్యూ అధికారులకు అప్పగిస్తామన్నారు.

సిరికొండలో మరో ట్రాక్టర్..

సిరికొండ: మండలంలోని ఒంటిప్ప తండా వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై ఎల్.రామ్ బుధవారం తెలిపారు.తండాకు చెందిన గుగులోతు నరేష్ ఎ లాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తుండటంతో పట్టుకొని ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

సీజ్ చేసిన ఇసుక వేలం

రుద్రూర్: పొతంగల్ మండలం సుంకిని శివారులో స్వాధీనం చేసుకున్న 13 ట్రాక్టర్ల ఇసుక డంప్‌కు బుధవారం వేలం నిర్వహించారు. పొతంగల్ తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన వేలంలో సుంకిని గ్రామానికి చెందిన యాదవ్ రావ్ రూ. 8,400కు దక్కించుకున్నట్టు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ

బోధన్‌రూరల్: భూలక్ష్మీ క్యాంపు అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ జరిగినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ తెలిపారు. వివరాలు.. మంగళవారం సాయంత్రం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి అంగన్‌వాడీ టీచర్ శిరీష తాళం వేసి ఇంటికెళ్లారు. విధుల్లో భాగంగా బుధవారం ఉదయం అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లగా అంగన్‌వాడీ కేంద్రం తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా పలు వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించి బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 2 గ్యాస్ సిలిండర్లు, వంట సామగ్రి, ఇతర వస్తువులు(సుమారు రూ.6 వేలు) చోరీకి గురయ్యాయి. అంగన్‌వాడీ టీచర్ శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యంచ గ్రామంలో బైక్ ..

నవీపేట: యంచ గ్రామానికి చెందిన పడాల నాగమణికి చెందిన మోటార్ సైకిల్ చోరీకి గురైనట్లు ఎస్సై వినయ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఈ నెల 23న ఇంటి బయట పార్క్ చేసిన వాహనం మరుసటి రోజు కనిపించలేదని బాధితురాలు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య

మోర్తాడ్(బాల్కొండ): ధర్మోరాకు చెందిన కానూరు లక్ష్మి(42) అనే మహిళ అప్పుల బాధ భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డారు. నాలుగు రోజుల కింద ఇంటి నుంచి బయటకు వెళ్లారు. గ్రామ శివారులోని చిన్నవాగులో బుధవారం ఆమె మృతదేహాన్ని గుర్తించారు. ఆమె భర్త గణేష్ ఉపాధి కోసం దుబాయ్‌కు వెళ్లగా స్థానికంగా ఉంటున్న ఆమెకు అప్పుల భారం పెరిగి మనస్తాపానికి గురై ఈ నెల 24న ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె కూతురు సంజుశ్రీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు.